క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో నమోదు చేయాలి



ప్రభుత్వాస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ కృష్ణవేణి

ఉరవకొండ: ప్రభుత్వాస్పత్రిలో జరిగే డెలివరీ కేసులు, ఆర్థో, కంటి, సాధారణ చికిత్సలకు సంబంధించి ప్రతి అంశాన్ని ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో నమోదు చేయాలని, అలా చేయకపోతే సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని డీసీహెచ్‌ఎస్ కృష్ణవేణి హెచ్చరించారు. మంగళవారం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిని డీసీహెచ్‌ఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించి, మందుల స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం డాక్టర్లు, హెడ్ నర్సు, సిబ్బందితో డీసీహెచ్‌ఎస్ సమావేశం అయ్యారు. ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో కాన్పులు ఇతర చికిత్సలకు సంబంధించి వివరాలు నమోదు చేయకపోవడం పట్ల డీసీహెచ్‌ఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ పరిశీలన

కణేకల్లు: తుంగభద్ర ఎగువ కాలువను కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ నూతన డీఈఈ మద్దిలేటి మంగళవారం పరిశీలించారు. ఆంధ్రా సరిహద్దు 105 కిలోమీటర్ నుంచి 189 కిలోమీటర్ వరకూ కాలువ మీదుగా పర్యటించి డిస్ట్రిబ్యూటరీలు, ఎస్కేప్ ఛానళ్ల పటిష్టతను తనిఖీ చేశారు. బొమ్మనహాళ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు నూతన డీఈఈని కలిసి వరినారు సాగుకు నీళ్లు వదలాలని విన్నవించారు. ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని డీఈఈ భరోసానిచ్చారు. అక్కడి నుంచి మోపిడి డీప్‌కట్ వరకు కాలువపై పర్యటించారు.

నేడు 'గడపగడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 20వ వార్డు పైతోట ఏరియాలో బుధవారం ఉదయం 6.30 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, అధికారులు హాజరు కావాలన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం పెద్దపీట

వజ్రకరూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని సర్పంచు మోనాలిసా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ టీవీల ద్వారా విద్యార్థులకు బోధన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 'నాడు–నేడు'తోపాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి తదితర పథకాల ద్వారా విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. హెచ్‌ఎం రంగప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'తల్ సైనిక్'పై ప్రత్యేక శిక్షణ



మాట్లాడుతున్న కమాండర్ అక్షయ్ మాథూర్

కూడేరు: తిరుపతిలో నిర్వహించే 'తల్ సైనిక్' క్యాంప్‌నకు ఎంపికయ్యేలా క్యాడెట్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ అక్షయ్ మాథూర్ తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో మంగళవారం సీఏటీసీ–4వ ఎన్‌సీసీ శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రతిభ కనబరిస్తే తిరుపతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని, అక్కడ ప్రతిభ కనబరిస్తే ఢిల్లీలో జరిగే తల్‌సైనిక్ కార్యక్రమానికి ఎంపిక అవుతారన్నారు. కార్యక్రమంలో అనంతపురం, కర్నూల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన 417 మంది క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరు బీసీ కాలనీలోని సుంకులమ్మ కట్ట నుంచి ఊరువాకిలి వరకూ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక చొరవతో మంగళవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద మంజూరైన నిధులతో జేసీబీచే రోడ్డును చదును చేయించారు. సర్పంచు కె.సురేంద్ర, కాంట్రాక్టర్ శివారెడ్డి పనులను పర్యవేక్షించారు.

మణిపూర్ మారణహోమం సిగ్గుచేటు



వినాయక సర్కిల్‌లో విద్యార్థుల మానవహారం

రాయదుర్గంటౌన్: మణిపూర్ మారణహోమాన్ని తీవ్రంగా ఖండిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల, పాఠశాలలకు చెందిన విద్యార్థులు మానవహారం ప్రదర్శించి నిరసన తెలిపారు. పట్టణంలోని వినాయక సర్కిల్‌లో ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తక్షణం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు.

తల్లిపాలు అమృతం

- బిడ్డకు బలమైన ఆహారం ఇవే..
- పుట్టిన గంటకే ఇచ్చే ముర్రుపాలతో బలం
- తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

బొమ్మనహాళ్/రాయదుర్గం టౌన్: తల్లి పాలు బిడ్డకు అమృతం. బిడ్డకు ముర్రుపాలు పట్టించడంతో వ్యాధి నిరోధకశక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం ప్రాప్తిస్తుంది. బిడ్డ రోగాల బారిన పడకుండా రక్షణ కవచంలా తల్లిపాలు పనిచేస్తాయి. పుట్టిన బిడ్డకు తల్లి పాలుపడితే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుంది. పసి పిల్లలకు అమృతం వంటి తల్లిపాలు, వాటి విశిష్టతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తోంది.

ఔషధ గుణాలు పుష్కలం

తల్లి పాలలో ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయని వైద్యులు అంటున్నారు. తల్లిపాలే సరైన పౌష్టికాహారం. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు అందిస్తే రోగనిరోధక శక్తికి, మానసిక వికాసానికి దోహదపడతాయి. ఆరు నెలల వరకు తల్లిపాలే అందించాలి. తల్లిపాలు తాగిన పిల్లల్లో తెలివితేటలు బాగుంటాయి. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లికి రొమ్ము కేన్సర్, రక్తస్రావం నుంచి విముక్తి కలుగుతుంది. అంతర్జాతీయ అధ్యయనంలో మన దేశంలో ఏటా నీళ్ల విరేచనాలు, నిమోనియా వంటి జబ్బులతో సుమారు లక్ష మంది ఏడాది లోపు శిశువులు మరణిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రసూతి ఆస్పత్రుల్లో పది సూచనల తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహాన్ని అవలంబిస్తే తల్లిపాలు ఇచ్చే వారి సంఖ్య అనూహ్యంగా పెంచవచ్చని గుర్తించారు.



రాయదుర్గంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వాలి



పుట్టిన బిడ్డకు ఆరు నెలలు వరకూ తల్లి పాలు ఇవ్వాలి. ఈ విషయంగా ఎలాంటి అపోహలకు తావివ్వరాదు. రోజుకు 10 నుంచి 12 సార్లు బిడ్డకు పాలు ఇవ్వాలి. బిడ్డ ఏడ్చిన ప్రతసారీ పాలు పట్టించవచ్చు. ఆరు నెలల వరకూ తల్లిపాలు ఇస్తే బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుంది.

– డాక్టర్ శ్రావణ్‌కుమార్, డి.హీరేహాళ్ పీహెచ్‌సీ

ముర్రుపాల ఆవశ్యకత వివరిస్తున్నాం



ముర్రుపాల ఆవశ్యకతపై అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా గర్భిణులు, బాలింతలను చైతన్య పరుస్తున్నాం. శిశువు పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు అందజేసేలా చర్యలు తీసుకున్నాం. తల్లిపాలు వారోత్సవాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించనున్నాం

– యల్లమ్మ, ఐసీడీఎస్ సీడీపీఓ, కణేకల్లు

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

కంబదూరు/కళ్యాణదుర్గం రూరల్/రాయదుర్గం టౌన్/ గుమ్మఘట్ట: తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని సర్పంచ్ లక్ష్మీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం కంబదూరు మండలంలోని పాళ్లూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో వైద్యాధికారి మాధవి, వైద్యులు సత్యప్రియ, రిహా, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు. రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి పాల్గొన్నారు. గుమ్మఘట్ట మండలంలోని కలుగోడులో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

ఉరవకొండ/రాయదుర్గం టౌన్/వజ్రకరూరు: ఉరవకొండ పట్టణంలోని 1వ సచివాలయం పరిధిలో ఉన్న తలారి వీధిలో మంగళవారం తెల్లవారుజాము నుంచే పండుగ వాతావరణం మధ్య పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఉపసర్పంచ్ వన్నప్ప, పార్టీ నాయకుడు శ్రీనివాసులు, వలంటీర్ల ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. అలాగే రాయదుర్గం పట్టణంతో పాటు వజ్రకరూరులో మొదటి రోజే 76 శాతంపైగా పింఛన్ పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

వాల్మీకుల అభ్యున్నతికి సీఎం కృషి



విప్ కాపును సన్మానిస్తున్న వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర

రాయదుర్గం: వాల్మీకి/బోయ సామాజిక వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని రాష్ట్ర వాల్మీకి/బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర అన్నారు. మంగళవారం రాయదుర్గం లో పర్యటించిన ఆయన స్థానిక వాల్మీకి నాయకులు డి హీరేహాళ్ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, ఓబుళాపురం మల్లికార్జునతో కలసి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిని సన్మానించారు. విప్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు.. అనంత, సత్యసాయి జిల్లాలో వాల్మీకుల అభ్యున్నతికి సీఎం జగన్ పెద్దపీట వేశాడన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలు (జెడ్పీ చైర్మన్), ఎంపీ, ఎమ్మెల్సీ, వాల్మీకి కార్పొరేషన్ స్టేట్ చైర్మెన్, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ లాంటి కీలక పదవుల్లో ఈ రోజు అత్యధిక సంఖ్యలో వాల్మీకులే కనిపిస్తున్నారంటే అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువేనని గుర్తుచేశారు. గత టీడీపీ హయంలో వాల్మీకులను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, జెడ్పీటీసీ పీఎస్ మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జొజ్జిరెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి మీకెక్కడిది?

రాయదుర్గం: దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన ముఖ్యమంత్రుల్లో ఒకటో స్థానంలో నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కొందరు టీడీపీ మహిళా నాయకురాళ్లు విమర్శించడంపై రాయదుర్గం కౌన్సిల్ బృందం భగ్గుమంది. మంగళవారం స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో మహిళా కౌన్సిలర్లతో కలసి చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి టీడీపీ నాయకురాళ్లకు లేదన్నారు. ఆయన కాలిగోటికి కూడా సరిపడలేని వారు నోటికొచ్చినట్టు మాట్లాడం సమంజషం కాదన్నారు. మహిళల సంక్షేమం, రక్షణకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే ఎన్నో సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చారన్నారు. దిశ చట్టం మహిళలకు రక్షణ కవచంగా నిలిచిందన్నారు. టీడీపీ హయాంలో మహిళలపై జరిగినన్ని అఘాయిత్యాలు, మానభంగాలు, దౌర్జన్యాలు బహుశా దేశంలోనే ఎక్కడ జరిగి ఉండవన్నారు. తాజాగా టీడీపీ మాజీ మంత్రి నారాయణ సొంత మరదలను లైంగికంగా చేస్తున్న వేధింపులు మీ కళ్లకు కనిపించలేదా..? అని ప్రశ్నించారు. వైస్ చైర్మన్ వలీబాషా, కౌన్సిలర్లు గౌని లావణ్య, పద్మజ, భీమనపల్లి నాగవేణి, మమత, శారదమ్మ, గజాల, షబీరాబీ, శ్రీలక్ష్మి, పొరాళ్ల గోవిందరాజులు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్, శివపుత్ర, కొంతెం దేవరాజు, వార్డు ఇన్‌చార్జులు పొరాళ్ల శివ, నిజామ్, దివాకర్, బషీర్ లు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభ చాటాలి

కళ్యాణదుర్గం: విద్యార్థి దశ నుంచే అన్ని రంగాల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని సరస్వతి విద్యామందిరం ప్రధానోపాధ్యాయులు కరణం తిరుమలరావు సూచించారు. స్థానిక సరస్వతి విద్యా మందిరంలో మంగళవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా 25 సరస్వతి విద్యామందిరాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన విద్యార్థులు ఈనెల 5, 6 తేదీల్లో పామిడిలో జరిగే ప్రాంత స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనేందుకు అర్హులన్నారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వాలి

కూడేరు: మండలంల అర్హులైన పేదలను గుర్తించి ఇంటి పట్టాలు ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సీపీఐ నేతలు హెచ్చరించారు. పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కూడేరు తహసీల్దార్ కార్యాయలం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఎస్‌ఎస్ ట్యాంకు పరిశీలన

రాయదుర్గంటౌన్: పట్టణానికి తాగునీరు సరఫరా చేసే డాక్టర్ వైఎస్సార్ హెచ్చెల్సీ శాశ్వత మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకును మంగళవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పరిశీలించారు. కణేకల్లులోని ఎస్‌ఎస్ ట్యాంకు వద్ద మున్సిపల్ డీఈ సురేష్, ఇంజినీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నీటి సరఫరా విభాగం సిబ్బందితో క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీ కాలవకు నీరు విడుదల చేసిన నేపథ్యంలో త్వరలో ఎస్‌ఎస్ ట్యాంకుకు నీటి పంపింగ్ చేయాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.

వదినపై దాడి

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లిలో అన్నదమ్ముల ఆస్తి గొడవలో అన్న భార్య వదినపై దాడి జరిగింది. పోలీసుల, బాధితులు తెలిపిన వివరాల మేరకు... చిన్నంపల్లిలో అన్నదమ్ములు తిమ్మరాజు, శేఖర్ మధ్య ఆస్తి విషయంలో గొడవ జరిగింది. విడిపించడానికి తిమ్మరాజు భార్య సరిత వెళ్లగా మరిది శేఖర్ ఆమెపై దాడి చేశాడు. గొడవలో గాయపడ్డ తిమ్మరాజు, ఆయన భార్య సరితను అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

జలధికి తరలిన పీర్లు

గుమ్మఘట్ట/రాయదుర్గం రూరల్/కళ్యాణదుర్గం/కుందుర్పి: గుమ్మఘట్ట మండలంలోని గలగల, గుమ్మఘట్ట, 75 వీరాపురం,పూలకుంట గ్రామాల్లో పీర్లను జలధికి తరలించారు. అలాగే రాయదుర్గం మండలంలోని టి.వీరాపురం, మెచ్చిరి గ్రామాల్లో జలధి ఉత్సవం నిర్వహించారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు, కుందుర్పి మండల కేంద్రంలో మొహర్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

ఉరవకొండ: పట్టణంలో తాగునీటి ఎద్దడిని నివారించడానికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి చొరవతో ఐదు ట్యాంకర్లతో తాగునీటి సరఫరాను మంగళవారం ప్రారంభించారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద తాగునీటి ట్యాంకర్లను సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, ఈఓ గౌస్‌సాహెబ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, వార్డు సభ్యులు వశికేరి మల్లి, గంధోడి మారేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గజగౌరీవ్రతం

కళ్యాణదుర్గం: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం గౌరీ వ్రతం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేపట్టారు. పట్టణంలోని మహిళలు గౌరీ వ్రతంలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు.

నాలుగు ఇళ్లలో చోరీ

రాయదుర్గంటౌన్: పట్టణ శివారులోని గౌడ లేఅవుట్‌లో నాలుగు ఇళ్లలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గార్మెంట్స్ కార్మికులు భారతి ఇంట్లో రూ.5 వేలు విలువ చేసే వెండి చైన్, రూ.10 వేలు నగదు, గంగాధర్ ఇంట్లో రూ.2 వేల నగదు, గ్రాము బంగారు జుమ్కీ చోరీ చేశారు. మరో రెండు ఇళ్ల తాళం పగలగొట్టగా కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో చోరీ జరిగిన విషయం తెలియరాలేదు. మరో ఇంటి తాళం పగలగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలపై రాయదుర్గం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

బొమ్మనహాళ్: అసాంఘిక కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులోని వేదావతి హగరి నది ఒడ్డున ఉన్న షిర్డీ సాయిబాబా మందిరాన్ని పరిశీలించారు. ఆదివారం ఆలయ మందిరంలో చోరీ జరిగిన విషయం విదితమే. ఏడాదిలోనే మూడుసార్లు దొంగతనం జరగడంపై ఆయన పరిశీలించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట బొమ్మనహాళ్ ఎస్‌ఐ శివ ఉన్నారు.

వ్యక్తి బలవన్మరణం

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లి నివాసి కోట్ల హనుమంతరాయుడు (51) పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకున్న ఏడున్నర ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే హనుమంతరాయుడు.. 3 నెలల క్రితం కుమార్తె వివాహానికి రూ.4లక్షలు, పంట పెట్టుబడులకు రూ.2లక్షలు, రైతుల వద్ద మరో రూ.2లక్షలు అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కోట్ల పాలాక్షి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్‌ఐ సునీత కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కూడేరు: స్థానిక అనంత వెంకట్రామిరెడ్డి కాలనీ వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి పొద్దుపోయాక చోటు చేసుకున్న ప్రమాదంలో హిందూపురానికి చెందిన సయ్యద్(50) మృతి చెందాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో జీవనం సాగిస్తున్న సయ్యద్ బళ్లారికి వెళ్లి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా ఘటనా స్థలికి చేరుకోగానే రోడ్డుపై అడ్డంగా ఉన్న గేదెను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉంటాం

గుమ్మఘట్ట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని పలువురు మహిళలు భరోసా కల్పించారు. మండలంలోని కలుగోడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమపథకాల వల్ల నయాపైసా లంచం లేకుండా , ఎలాంటి వ్యయ ప్రయాసాలకు గురికాకుండా పథకాల వల్ల లబ్ధి పొందుతున్నామని పలువురు మహిళలు విప్ ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. విప్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పలుకుబడి వున్న వారికి, టీడీపీ జెండాలు మోసిన వారికి , లంచాలు ఇచ్చిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 610 సాధ్యం కాని హామీలిచ్చి, ప్రజలను వంచించిన చంద్రబాబును మరోసారి నమ్మితే నట్టేట ముంచడం ఖాయమన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పని చేసిన కాలవ శ్రీనివాసులు రాయదుర్గం నియోజకవర్గంలో వున్న సహజసంపదను కొల్లగొట్టి దోచుకోవడానికి వచ్చాడన్నారు.ఆయన దోపిడికి ఇచ్చిన ప్రాధాన్యత ప్రజల అభివృద్ధికి ఇచ్చిన దాఖలాలు మచ్చుకైనా లేవన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సురేశ్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, సర్పంచులు ఉమేష్, అనిల్ , ఎంపీటీసీ ఈరన్న, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప, పీఏసీఎస్ అధ్యక్షుడు సూరిబాబు, నాయకులు నాగేంద్రప్ప, హనుమంతరెడ్డి, రాజయ్య, సూరయ్య, గోవిందరెడ్డి, శివ, మల్లికార్జున, డీలర్లు గోవింద, బొమ్మేష్, వీరారెడ్డి, అంజినయ్య తదితరులు పాల్గొన్నారు.



గుమ్మఘట్ట: కలుగోడులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



బెళుగుప్ప: గంగవరంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి

బెళుగుప్ప: నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నవరత్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గంగవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రోజా, ఎంపీటీసీ ప్రసాద్, ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు తదితరులతో కలసి మాజీ ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగేళ్ల పాలనలో నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందన్నారు. ఒక్క జగనన్న సురక్ష కార్యక్రమంతోనే రాష్ట్రంలో 1.4 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. బెళుగుప్ప మండలంలోనే జగనన్న సురక్ష కార్యక్రమంలో 3,046 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిచారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. రికార్డు స్థాయిలో ఇళ్లు నిర్మిస్తున్నారని, ప్రతి పేదవాని ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా జగనన్న పాలన సాగిస్తున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహకా ర సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, నియోజకవర్గ నాయకులు దేవేంద్ర, కేశవరెడ్డి, గోవిందరెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, సర్పంచ్‌లు రామిరెడ్డి, రుద్రానంద, ఎర్రిస్వామి, ఎండీ పెద్దన్న, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, నాయకులు నరసింహప్ప, రామాంజనేయులు, రమేష్, రఘు, మస్తాన్‌వలి, రవి, దశరథ్, జలీల్, మల్లప్ప పాల్గొన్నారు.

'కాలవా'.. సెల్ఫీ రాజకీయాలు మానుకో



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి

రాయదుర్గంటౌన్: మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సెల్ఫీ టైంపాస్ రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి ఘాటుగా చురకలంటించారు. 74 ఉడేగోళం గ్రామంలోని టెక్స్‌టైల్స్ పార్కుపై కాలవ చేసిన సెల్ఫీ ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. గార్మెంట్స్ పరిశ్రమ వ్యాపారులు, టెక్స్‌టైల్స్ రంగానికి రూ.1400 కోట్ల సబ్సిడీ అందజేసి ప్రోత్సహించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందనే విషయాన్ని కాలవ తెలుసుకోవాలని హితవు పలికారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, పట్టణ కన్వీనర్ ముస్తాక్, కౌన్సిల్ సభ్యులతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాలవ శ్రీనివాసులు టెక్స్‌టైల్స్ పార్కుపై చేసిన సెల్ఫీ రాజకీయం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాయదుర్గంలో గార్మెంట్స్ పరిశ్రమను కరోనా సంక్షోభంతో రెండేళ్ల పాటు గార్మెంట్స్ పరిశ్రమ ఛిన్నాభిన్నం కాగా వ్యాపారులు నేటికి కోలుకోలేని పరిస్థితి ఉందన్నారు. మంత్రిగా నీ హయాంలో 6 యూనిట్లు ప్రారంభించామని గొప్పలు చెప్పడం మాని, వ్యాపారుకు సబ్సిడీ లేదా ప్రోత్సాహం అందజేసి ఆదుకున్న దాఖలు ఏవైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. నీవు సెల్ఫీ తీసిన అపరెల్‌పార్కు వద్దకు ఏ టీడీపీ నాయకుడు వచ్చినా సమాధానం చెబుతామని సవాల్ చేశారు. అపెరల్ పార్కులోని వ్యాపారులకు రూ.లక్షల్లో సబ్సిడీ ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. అలాగే టిట్కో ఇళ్లు, ఆస్పత్రి, రోడ్ల నిర్మాణాలపై సెల్ఫీ రాజకీయం కాల అభద్రతాభావానికి నిదర్శనమన్నారు. కౌన్సిలర్లు పైతోట సంజీవప్ప, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు సునార్ ఇస్మాయిల్, పొరాళ్ల శివకుమార్, వైజాగ్ రవి, బషీర్ అహ్మద్, భీమనపల్లి దివాకర్, గంగాధర్, అరవ శివప్ప పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

రాయదుర్గం రూరల్: మండలంలోని పల్లేపల్లి, మెచ్చి రి గ్రామాల మధ్య ఉన్న చెక్‌పోస్ట్ వెనుక ఉన్న మట్టిదారిలో పల్లేపల్లికి చెందిన బోయచిన్న చౌడప్ప (43) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు.. గొర్రెల పెంపకం, వ్యా పారం చేసే చౌడప్ప అప్పుడప్పుడు మద్యం మత్తులో భార్యతో గొడవపడేవాడు. సోమవారం సాయంత్రం మద్యం మత్తులో భార్యతో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి పొద్దుపోయినా ఇంటికి రాలేదు. వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గొర్రెల వ్యాపారానికి వెళ్లి ఉంటాడని కుటుంబసభ్యులు అనుకున్నారు. మంగళవారం ఉదయం పొలాలకు వెళుతున్న మెచ్చిరి గ్రామస్తులు.. చౌడప్ప మృతదేహాన్ని గుర్తించి సమాచారమివ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించి, బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు , అర్బన్ , రూరల్ సీఐలు లక్ష్మణ్ణ, యుగంధర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మద్యం మత్తులో కిందపడి దాహంతో మృతిచెంది ఉంటాడని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. అయితే తన భర్త మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ భార్య లక్ష్మి ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దొంగ ఓట్లను కాపాడుకోవడానికి కేశవ్ కుట్ర

ఉరవకొండ: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఓటరు జాబితాలో ఉన్న టీడీపీ నాయకులే పట్టణ ప్రాంతాల్లో కూడా వారి కుటుంబ సభ్యుల సహా ఉన్నారని, దీని పై ఎన్నికల కమిషనర్‌కు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఫిర్యాదు చేస్తే మీకు అంత ఉలుకు ఎందుకని, కేవలం దొంగ ఓట్లను కాపాడుకోవడానికే పయ్యావుల కేశవ్, టీడీపీ నాయకులు విచారణను అడ్డుకుంటున్నారని వైస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక వైఎస్సాఆర్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యలు ఏనాడూ పట్టించుకోని ఎమ్మెల్యే కేశవ్ ప్రస్తుతం మరో పది రోజుల్లో తన కుమారుడి వివాహం పెట్టుకుని దొంగ ఓట్లను కాపాడుకోవడానికి హైదరాబాద్ నుంచి హుటాహుటిన అనంతపురానికి వచ్చి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచే దమ్ములేని కేశవ్ దొంగ ఓట్ల మీదే ఆధారపడ్డారన్నారు. ఉరవకొండలో జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో కూడా టీడీపీ నాయకులు అధికారులతో వాగ్వివాదానికి దిగుతూ దొంగ ఓట్లను తొలగించరాదని అడ్డుకున్నారన్నారు. సమావేశానికి హాజరైన వారిలో 90 శాతం మంది టీడీపీ నాయకులకు దొంగ ఓట్లు ఉన్నాయని, వీటిని సాక్ష్యాధారాలతో చూపిస్తున్నామన్నారు. ఇందులో వజ్రకరూరుమండల టీడీపీ ఉపాధ్యక్షుడు బోరుగుంట్ల నాగేంద్రకు పీసీప్యాలి 520 పీఎస్‌లో, ఉరవకొండలో 132 పీఎస్‌లో ఓట్లు ఉన్నాయన్నారు. ఇదొక్కటే కాదు వందలాది టీడీపీ నేతలకు డబుల్ ఓట్లు ఉన్నాయన్నారు. దొంగ ఓట్ల వ్యవహారం బయటపడినందుకు ఎమ్మెల్యే కేశవ్‌కు ఓటమి భయం పట్టుకుందని ప్రస్తుతం మైండ్‌గేమ్ ఆడుతూ తన పార్టీ నాయకులను తొలగించకుండా అడ్డుకుంటున్నారన్నారు. టీడీపీ నాయకులకు దమ్ముంటే విచారణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వన్నప్ప,పార్టీ నాయకులు కోఆప్షన్‌సభ్యులు పామిడిసలీం, మూలగిరిపల్లి ఓబన్న, ఆంజి, జోగిభీమా, వేమన్న, జోగి సిద్దు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతలకు ఉన్న డబుల్ ఓట్లను సాక్ష్యాలతో చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు